  

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

రంగారెడ్డి
వికారాబాద్
మేడ్చల్

ఆదివారం 13 జూలై 2025 పేజీలు 8

# న్యాయ వాద వృత్తి సవాళ్లతో కూడు కున్నది : సిజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్




నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న ముఖ్య అతిథులు..

## స్నాతకోత్సవంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ సుజయ్ పాల్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూలై, 12): "న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. మెంటార్షిప్ అవసరం. నైపుణ్యం సాధించాలంటే సరైన మార్గదర్శకత్వం అవసరం. వృత్తిని ప్రేమించాలి" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ (బీఆర్ గవాయ్) అన్నారు. 3 లో

డ్రగ్స్ సంస్కృతిని సహించకుండా

# ఉక్కు పాదంతో అణిచివేయాలి...

- రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు - వికారాబాద్‌లో ఎక్సైజ్ పిఎస్‌ను ప్రారంభించిన మంత్రి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూలై 12): డ్రగ్స్ సంస్కృతిని సహించకుండా ఉక్కు పాదంతో అణిచివేయాలనిరాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. మిగతా 2లో

# గోశాలను ఇతర ప్రదేశాల్లోకి తరలించండి : ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

- ఈ విషయంపై త్వరలో ముఖ్యమంత్రికి విన్నవిస్తాం
- ఎన్కేపల్లి భూ బాధితులకు అండగా ఉంటాం భరోసానిచ్చిన బిజెపి నాయకులు
- ప్రభుత్వం గోశాల నిర్మించాలంటే జిల్లాలో ఎక్కడైనా నిర్మించవచ్చు
- మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోనే ఖరీదైన భూమిలోనే ఎందుకు నిర్మించాలి
- మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం




మొయినాబాద్ మేజర్ న్యూస్( జూలై 12)జిల్లాలో అనేక ప్రభుత్వ భూములు ఉన్నాయని అక్కడికి గోశాలను తరలించాలని.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 1000 కోట్ల విలువైన ఎన్కేపల్లి లోనే ఎందుకు ప్రభుత్వం ఏర్పాటు చేయలను కుంటుందో అర్థం కావడం లేదని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మిగతా 2లో

చెంచు కాలనీవాసుల నిమిత్తం

# బహుళార్థక సాధక కేంద్ర భవన నిర్మాణం...

- రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (జూలై 12):** చెంచు కాలనీ వాసుల నిమిత్తం బహుళార్థక సాధక కేంద్ర భవనం నిర్మాణం చేస్తున్నట్లు శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. మిగతా 6లో

# మెయిన్ రహదారి నిర్మాణానికి పార్టీలకతీతంగా సహకరించాలి

## గాంధీనగర్ నుండి నాదర్గుల్ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సబితా రెడ్డి

బాలాపూర్ మేజర్ న్యూస్(జులై 12): గాంధీనగర్ నుండి నాదర్గుల్ వరకు మెయిన్ ప్రధాన రహదారి నిర్మాణానికి నాదర్గుల్ ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా సహకరించాలని సబితా ఇంద్రా రెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గాంధీనగర్ నుండి నాదర్గుల్ ప్రారంభమైన రోడ్డుపనులను మిగతా 2లో



# గోశాలను ఇతర ప్రదేశాల్లోకి తరలించండి : ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి




**మొదటిపేజీ తరువాయి...** శనివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లి రెవెన్యూలో నిరుపేదలైన బడుగు బలహీన వర్గాల రైతులను పంటలు పెట్టుకోకుండా వారి కడుపుకు తిండి లేకుండా కంటికి నిద్ర లేకుండా సుమారు రెండు నెలలుగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు మద్దతుగా చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి బిజెపి నాయకులు మద్దతుగా నిలిచారు భూ నిర్వాసితులను కలిసి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాలను నిర్మించేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ భూములు అనేకం ఉన్నాయని వాటిలో ఎక్కడైనా పెట్టొచ్చని ఆయన అన్నారు ప్రభుత్వం కావాలని సుమారు 100 కోట్ల విలువైన మున్సిపాలిటీ రెవెన్యూ లో ఎందుకు పెట్టాలని అనుకుంటుందో నిరుపేద రైతుల జీవితాలతో ఎందుకు ఆడుకుంటుందో అర్థం కావడం లేదన్నార ఇదే విషయంపై త్వరలో సీఎం రేవంత్రెడ్డిని కలిసి విన్నవించడం జరుగుతుందని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్రెడ్డి పేర్కోన్నారు. ఎన్కేపల్లిలోని సర్వే నంబర్ 180లోని 99 ఎకరాల 14 గుంటల ప్రభుత్వ స్థలంలో గోశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోశాల ఏర్పాటుకు జిల్లాలో అనేక ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని వాటిని కాకుండా ఎన్కేపల్లిలోని సాగు భూములను పేద రైతుల నుంచి లాక్కోవడం సరైనది కాదని అన్నారు. ఎన్కేపల్లి భూ బాధితులకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందని న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తునే ఉంటామని పేర్కొన్నారు. ఇదే విషయంపై త్వరలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని కలిసి పూర్తి వివరాలు వెల్లడించి ఎన్కేపల్లి రైతులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని రైతులకు భరోసానిచ్చారు. ఎన్కేపల్లిలోని ప్రభుత్వ స్థలం సాగుకు పనికి వచ్చేదని దీనిని ప్రభుత్వం దృష్టిలో ఉం చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, సీనియర్ నాయకులు ప్రభాకర్రెడ్డి, మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మోర నర్సింహ్మారెడ్డి, ప్రభాకర్ యాదవ్, రైతులు సికిందర్, దప్పు రమేష్, ఈశ్వర్ రైతులు పాల్గోన్నారు.

# మెయిన్ రహదారి నిర్మాణానికి పార్టీలకతీతంగా సహకరించాలి



**మొదటిపేజీ తరువాయి...** మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శనివారం అధికారులు ప్రజాప్రతినితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సబితా రెడ్డి మాట్లాడుతూ... రోడ్డుపనులకు అడ్డుగా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు సంబంధిత ఫారెస్ట్, విద్యుత్ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. రహదారి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, ప్రజలకు త్వరితంగా అందుబాటులోకి తేవాలని అన్నారు. నాదర్గుల్, బడంగ్ పేట్ ప్రజా ప్రతినిధులు పార్టీలకతీతంగా మన రహదారి మనం బాగు చేసుకోవడానికి అందరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డీఈ, ఏఈలు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, నాదర్గుల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### డ్రగ్స్ సంస్కృతిని సహించకుండా

# ఉక్కు పాదంతో అణిచివేయాలి...

**మొదటిపేజీ తరువాయి...** శనివారం వికారాబాద్ పట్టణ కేంద్రంలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ను శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శాసనసభ్యులు కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభోత్సవం గావించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయితో పాటు ఇతర మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న వారిని గుర్తించి కేసుల నమోదుతో కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాలు ఎక్కడి నుండి సరఫరా అవుతుందనే విషయాన్ని పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరిని విడనాడి ఉమ్మడిగా కార్యాచరణ బద్ధంగా నిఘా పెట్టాలని మంత్రి సూచించారు. అవసరం అనుకుంటే ఇతర రాష్ట్రాల సహకారం కూడా తీసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిధులను కేటాయించి చెరువు కట్టల మీద, గుట్టల పైన, కాలువల పక్కన ఈత, తాటి, ఖజురా వంటి చెట్లను పెంచేందుకు ప్రోత్సహించాలని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామంలో మీసం 5 ఎకరాల్లో చెట్లను నాటేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. హైదరాబాదుకు అతి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం నుండి నీరా, కల్లును ఎగుమతి చేసే విధంగా ఎదగాలని మంత్రి తెలిపారు. కల్లు సేవించి మరణించిన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి తెలిపారు. కల్తీ కల్లు మూలంగా కూలి నాలి చేసుకుని పొట్ట నింపుకుంటున్న పేదలు బలి కాకూడదని మంత్రి తెలిపారు. కల్తీ కల్లు విక్రయానికి పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి తెలిపారు. శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... గౌడ్ అన్నల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ




భూముల్లో ఈత, తాటి వనాలను పెంచేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఆయన తెలిపారు. శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు హాని కలిగించే సంఘటనపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో కార్యాలయాలు నిర్వహించకుండా ఉండేదుగాను ఎక్సైజ్ శాఖకు అది నూతన పోతున్న భవనాలను నిర్మించుకోవడం శుభ సూచికమని ఆయన అన్నారు. కల్తీ కల్లు, మాదకద్రవ్యాల నివారణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.... సమాజ నాశనానికి డ్రగ్స్ ఎంతో కీడును కలిగిస్తున్నాయన్నారు. పల్లెల్లో కూడా డ్రగ్స్ వ్యాపిస్తున్నాయన్నాయని వాటిని అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన తెలిపారు. అదేవిధంగా రిసార్ట్ లపై ప్రత్యేక దృష్టి సారించి డ్రగ్స్ నివారణకు అధికారుల కృషి చేయాలి అన్నారు. ముందుగా కార్యాలయ ఆవరణలో మంత్రి, సభాపతి, అధికారులతో కలిసి ఈత మొక్కలను నాటి నీరు





పోశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్, సూపరింటెండెంట్ విజయ భాస్కర్, అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్డీవో వాసు చంద్ర, తాసిల్దార్ లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ శాఖ సర్కిల్, సబ్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.






# న్యాయ వాద వృత్తి సవాళ్లతో కూడు కున్నది

**: సిజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్**



సీఎం రేవంత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధిక గుప్తాలు






స్నాతకోత్సవంను ఉద్దేశించి మాట్లాడుతున్న.. సిజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్

మొదటిపేజీ తరువాయి...

**న్యాయవాదులు నిరంతరం తమను - తాము నిరూపించుకోవాలి:**

ఈ సందర్భంగా, జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ... "న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాలి. కోర్టు తీర్పులపై సమగ్ర అవగాహన అవసరం. నేటి పరిస్థితుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా ప్రైవసీ వంటి అంశాల్లో ప్రయోజనాలు, ప్రతికూలతలు రెండూ ఉన్నాయి. ఈ రంగంలో ప్రవేశించేవారి సంఖ్య పెరుగుతోంది. మార్గదర్శకత్వం ఉంటేనే నైపుణ్యం పెరుగుతుంది. మెంటార్షిప్‌ను బాధ్యతగా భావించాలి. వృత్తిని ప్రేమించాలి. అప్పుడే సరైన ఫలితాలు సాధ్యమవుతాయి" అని పేర్కొన్నారు. "న్యాయ వ్యవస్థలో కేసుల విచారణ వందలాది రోజులు లాగిపడుతోంది. ఇది ఆందోళనకరం. న్యాయవాద వృత్తి ఒంటరితనాన్ని పెంచే అవకాశం ఉంది. విదేశీ డిగ్రీలు స్వయంగా శ్రేష్ఠతకు సంకేతం కావు. దేశీయ న్యాయ విద్యపై నమ్మకం పెంపొందించాలి. ఎల్ఎల్ఎం కోర్సుల్లో పెట్టుబడి పెరగాలి. ఉత్తమ న్యాయవాదులను దేశం లోపలే పెంచుకోవాలి" అని సూచించారు. "జీవితంలో పుస్తకాలు, కుటుంబం, స్నేహితులు, ఆరోగ్యం, ఊహ అనే ఐదు అంశాలు శాశ్వతంగా ఉండాలి" అని విద్యార్థులకు సూచించారు.

**నల్సార్ పురోగతిని వివరించిన వైస్ ఛాన్సలర్**

వైస్ ఛాన్సలర్ కృష్ణ దేవరావు ప్రసంగంలో 2023-24 విద్యా సంవత్సరపు విద్యా, పరిశోధనా విజయాలను వివరించారు. ఎస్సీ/ఎస్టీ అత్యాచారాల నివారణ చట్టం కింద ప్రత్యేక కోర్టుల ఆధునీకరణ కోసం సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి నల్సార్ పనిచేసిందని తెలిపారు.

జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఢిల్లీ నుంచి ప్రాజెక్ట్ 39Aను నల్సార్‌కు తరలించడం గర్వకారణమని పేర్కొన్నారు. నల్సార్ విద్యా ప్రమాణాలు, సామాజిక న్యాయంపై దృష్టిని, ప్రజాసేవకు కట్టుబాటును వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్సార్‌కు అందిస్తున్న మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు.

**చట్ట గ్రంథాలు ఆవిష్కరణ**

ఈ సందర్భంగా పిల్లల హక్కులు, తులనాత్మక క్రిమినల్ చట్టాలు, కాంట్రాక్టులపై రూపొందించిన చిత్రపరమైన హ్యాండ్‌బుక్‌లు, 'నల్సార్ లా సమీక్ష' జర్నల్‌ను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ వాసంతి, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**460 మందికి డిగ్రీలు - 58 మందికి బంగారు పతకాలు**

ఈ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ, ఎల్ఎల్ఎం, ఎంబీఏ, బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీబీఏ (ఆనర్స్), పీజీ డిప్లొమా కలిపి 460 మందికి డిగ్రీలు, డిప్లొమాలు అందజేశారు. అందులో 58 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. బీఏ ఎల్ఎల్‌బీ (ఆనర్స్) విభాగంలో ఇషికా గార్గ్ ఎనిమిది పతకాలు గెలుచుకుంది. కెఎస్ శైలేంద్ర ఏడు, అర్చిత ఆరు, భవ్య నాలుగు, తేజస్వి, శ్రుతి, అకిల్ సూర్య ముగ్గురు తలతలకూ మూడు, శ్రుతి, సాన్వి ఇద్దరూ రెండేసి, శ్రీవల్లి, అనుష్క అరివలగన్, జాహ్నవి, ప్రద్యుమ్న, షమిక్, విష్ణ ఒక్కొక్కరు ఒక్కో బంగారు పతకం గెలుచుకున్నారు. ఎల్ఎల్ఎం విభాగంలో ముస్కాన్ కార్లా రెండు పతకాలు గెలుచుకుంది. బి.హరిణి, హుజైఫా షేక్, నందిని శివేర్ ఒక్కొక్క బంగారు పతకాన్ని పొందారు. ఎంబీఏ బీఏ ఎల్ఎల్‌బీ విభాగంలో ముస్కాన్ అల్వి బంగారు పతకాన్ని అందుకుంది.



జస్టిస్ గవాయ్‌కు స్వాగత పలుకుతున్న కలెక్టర్ మను చౌదరీ



స్నాత్సకోత్సవంలో బంగారు పతాకాన్ని ప్రధానం చేస్తున్న.. సిజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్

**అతిథులకు కలెక్టర్ల స్వాగతం**

ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధిక గుప్తాలు స్వాగతం పలికారు.




డిగ్రీలు, బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు..

## తాగిన మైకంలో బాల్కనీ నుంచి పడి వ్యక్తి మృతి

**శామీర్‌పేట,మేజర్ న్యూస్(జులై12):** తాగిన మైకంలో బాల్కనీ నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. **పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం......**



తూముకుంట పురపాలక సంఘం పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ 7 వ బ్లాక్, ఫ్లాట్ నెంబర్ 619లో నివాసం ఉంటున్న షేక్ ఫరీద్ (36) వృత్తి వృత్తిరీత్యా లేబర్ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా శుక్రవారం సాయంత్రం బాల్కనీలోని గోడపై కూర్చొని ఉండగా తాగిన మైకంలో జారి పడడంతో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రైతులకు సబ్సిడీ సదవకాశాలు నియోగించుకోండి : ఆర్. స్వప్నిక

**కీసర,మేజర్ న్యూస్ (జూలై 12):**
ఉద్యాన శాఖ అమలు చేస్తున్న పథకాలను రైతులు సమర్థవంతంగా వినియోగించుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధ్యపడతాయని కీసర డివిజన్ ఉద్యాన అధికారి ఆర్. స్వప్నిక తెలిపారు. మేడ్చల్ జిల్లాలో ఉద్యాన సాగును ప్రోత్సహించేందుకు వివిధ సబ్సిడీ పథకాలు అందుబాటులో ఉన్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

**ఈ సందర్భంగా ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి:**

టొమాటో, వంకాయ, మిర్చి కూరగాయల నార్లు ఉచితంగా లభించనున్నాయి.

మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, అత్తి, బొప్పాయి మొక్కల నాటితే నిర్వహణ ఖర్చుపై 40 శాతం సబ్సిడీ ఉంటుంది. 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్యాక్ హౌస్ నిర్మించిన రైతులకు రూ. 2 లక్షల వరకు సబ్సిడీ లభిస్తుంది. మల్చింగ్ పద్ధతిలో కూరగాయలు వేసే రైతులకు 50 శాతం వరకు సబ్సిడీ ఇవ్వబడుతుంది.

స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు వంటి పరికరాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయి.

పాత తోటల పునరుద్ధరణ, ఫార్మ్ పాండ్ నిర్మాణం, అంటుకట్టిన వంకాయ మొక్కలు, బంతిపూల సాగుకు కూడా సబ్సిడీలు ఉన్నాయి.

ఈ పథకాల వివరాలకు సంబంధిత డివిజన్ ఉద్యాన అధికారులను రైతులు సంప్రదించగలరు.

మేడ్చల్ డివిజన్: జి. రామకృష్ణ - 89777 14251
కీసర డివిజన్: ఆర్. స్వప్నిక - 89777 14464

# అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు

**▸▸ డిసిసి ఉపాధ్యక్షుడు బోలుసాని భీంరెడ్డి ▸▸ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్ ఆంజనేయులు ముదిరాజ్ ▸▸ పుట్టపహాడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలన**

**కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (జూలై 12)**
అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లను అంది స్తామని డిసిసి ఉపాధ్యక్షుడు బోలుసాని భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్ ఆంజనేయులు ముది రాజ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పుట్టాపహాడ్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఎక్కడ కూడా ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదని, ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. పేదలకు సొంత ఇల్లు ఉం డాలనే కల నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది అని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా సహాయం అందించడమే కాకుండా ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యే విధంగా అధికారులను ఆదేశించ డం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయ కులు తమ తమ ప్రాంతాలలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం అయ్యేవిధంగా వారికి సహాయం అందించాలని వారు తెలిపారు. పేదలకు

**ఇందిరమ్మ ఇండ్ల ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు**

ఇందిరమ్మ ఇళ్లు అందించే ప్రక్రియలో ఎక్కడ కూడా పార్టీ బేధాలు, తమ మన బేధాలు చూడటం లేదు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ మండల అధ్యక్షు డు వెంకటయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగయ్య ముదిరాజ్, మండల నాయ కులు హరినాథ్ రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.



# మహాలక్ష్మీ పథకం అమలు చేయకపోతే ఉద్యమమే

## ▶▶ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ▶▶ కాకునూరులో మహాలక్ష్మీ అమలు కోసం పోస్టు ఉద్యమానికి శ్రీకారం



కేశంపేట, మేజర్‌న్యూస్ (జులై 12): తెలంగాణ ఎన్నికల మెనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒకటైన మహాలక్ష్మీ పథకాన్ని వెంటనే అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ, మాజీ ఎంపి కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేశంపేట మండలం కాకునూరులో ఆమె మహిళలతో కలిసి శనివారం మహాలక్ష్మీ పథకం అమలు కోసం సోనియాగాంధీకి పోస్టుకార్డులు పంపించి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక పూర్తిగా విఫలమైందని, అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ప్రజావిశ్వాసం కోల్పోయిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫించన్లు పెంచుతామని, ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామన్న మాట ఏమైందని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి పైసా పుట్టడం లేదని మాట్లాడి తెలంగాణ ఇజ్జత్ తీశారన్నారు. తాము ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేసి మహిళలకు మహాలక్ష్మీ పథకం కింద ప్రతి నెల ఇస్తామన్న 2500 రూపాయలు పెండింగ్‌లో ఉంచిన 18 నెలలవి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట పీఏసీఎస్ చైర్మెన్ జగదీశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ, నాయకులు జంగారెడ్డి, సీమల శ్రీనివాస్, జాగృతి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన పూలపల్లి కృష్ణారెడ్డి

గండిపేట్, మేజర్ న్యూస్ (జూలై 12) రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి 42% రిజర్వేషన్లు కల్పించినందుకు శనివారంబండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఎమ్మెల్యే ప్రకాష్ చిత్రపటాలకి బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా పూలపల్లి కృష్ణారెడ్డి మాట్లాడుతూబీసీలకు 42% రిజర్వేషన్ల కొరకు అసెంబ్లీ లో తీర్మానం చేసి ఆర్డినెన్స్ పంపినందుకు బీసీలు రుణపడి ఉంటారని అన్నారు.కులగణన చేసి దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ నిలిచిందని తెలిపారు.రాష్ట్రంలో అన్ని కులాలకు సమన్యాయం జరిగే విధంగా తెలంగాణలో అత్యధికంగా ఉన్నటువంటి బీసీల కోసం 42% స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లకు మంత్రి మండలి తీర్మానం చేయడం ఆశించేదగ్గ విషయమని వెల్లడించారు.పంచాయతీరాజ్ చట్టం 2018 సవరణ కొరకు ఆర్డినెన్స్ కోసం పంపడం జరిగింది దీనికి బిసి లు అందరూ అభినందించారని తెలిపారు . ఈ రిజర్వేషన్లు దేశంలో ఉన్నటువంటి ప్రతి రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ



మేయర్ బుర్ర మహేందర్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్ , బీసీ సెల్ అధ్యక్షుడు అంకం శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ సుదర్శన్ ముదిరాజ్, ఎస్ శంకర్ , శ్రీను ముదిరాజ్, కట్ట విష్ణు,లక్ష్మణ్ ,వి .చిన్న గౌడ్ ,జి సురేష్ గౌడ్ ,సాగర్ గౌడ్, రాందాస్ గౌడ్ , రమేష్,కొరివి గణేష్ ,సుధాకర్ ,జి అశోక్ .తుకారం, అరుణ్ ,ప్రవీణ్ గౌడ్ ,తదితరలు పాల్గొన్నారు.

## గో గో కార్ డిటైలర్స్ షోరూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



బాలాపూర్ మేజర్ న్యూస్(జులై 12):మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ న్యూ మారుతి నగర్, పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ లైన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గో గో కార్ డిటైలర్స్ షోరూమ్‌ను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు.ఈ ప్రారంభ కార్యక్రమంలో పెద్దబావి ఆనంద్ రెడ్డి, సహకార బ్యాంక్ చైర్మన్ మర్రి నరసింహారెడ్డి, సూర్ణ గంటి అర్జున్, యెచ్చల్ సుదర్శన్ రెడ్డి, పెద్దబావి శ్రీనివాసరెడ్డి, బిమిడి జంగారెడ్డి, రామిడి రామిరెడ్డి, బోర్ర జగన్ రెడ్డి, షోరూమ్ యాజమాన్యం సభ్యులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## విజయ్ దేవరకొండను వెంటనే అరెస్టు చేయాలి

### గిరిజన నాయకులు ఆకాశ్ నాయక్




ఫరూఖ్‌నగర్, మేజర్‌న్యూస్ (జులై 12): గిరిజనుల మనోభావాలు దెబ్బతీసే విదంగా ట్రైబల్ కమ్యూనిటీని పాకిస్తాన్ ఉగ్రవాదులతో పోల్చిన సినీహీరో విజయ్‌దేవరకొండను వెంటనే అరెస్టు చేయాలని గిరిజన నాయకుడు ఆకాశ్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలో గిరిజన నాయకులు మీడియాతో మాట్లాడుతూ సినీ హీరో అల్లు అర్జున్‌కు ఒక న్యాయం విజయ్ దేవరకొండకు ఒక న్యాయమా ? అని ప్రశ్నించారు. విజయ్‌దేవరకొండపై నామమాత్రంగా ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి పోలీసులు చేతులు దులుపుకున్నారని, అతన్ని అరెస్టు చేయకుండా కాలయాపన చేయడం వెనక ఆంతర్యమేమిటన్నారు. గిరిజనుల ఆత్మగైరవాన్ని కాపాడాలంటే విజయ్‌దేవరకొండను వెంటనే అరెస్టు చేయాలని లేని పక్షంలో న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గిరిజన నాయకులు సంతోష్ నాయక్, ఆకాశ్ చౌహాన్, ప్రకాశ్ నాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (జూలై 12) :చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 30ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. చేవెళ్లలోని కేసారం సమీపంలోని శ్రీనివాస్‌గౌడ్ ఫాంహౌస్‌లో శనివారం ఈ 1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా అప్పుడు విద్యాను అందించిన గురువులను పిలిచి వారిని సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అప్పట్లో విద్యను అందించిన గురువు జీవన్‌బాబు అమెరికాలో స్థిరపడిపోవడంతో ఆయన రాకకోసం వేచి చూసిన పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసి జీవన్‌బాబు దంపతులను సన్మానించారు. పూర్వ విద్యార్థులంతా గురువులతో సరదాగా అనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందించారు. ఈకార్యక్రమంలో గురువులు జీవన్‌బాబు, సంగీత దంపతులు, సతీష్, పూర్వ విద్యార్థులు బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, సంగమేశ్వర్, భీమయ్య, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సత్య నారాయణ, రాజేందర్‌రెడ్డి, కళ, అరుందతి, అనిత, మంజుల, లక్ష్మి, స్వర్ణలత, లీల, గణేష్, గోపాల్, బాల్‌రాజ్, శ్రీకాంత్, రవీందర్, రాకేశ్, వెంకటేశ్, ప్రకాశ్, మహ్మద్, రెహమాన్, క్రిష్ణ తదితరులు ఉన్నారు.

## కడ్తాల్ ఆడోనైడ్ కృపా చర్చిలో సిసి కెమెరాల ఏర్పాటు



కడ్తాల్, మేజర్‌న్యూస్ (జూలై 12): కడ్తాల్ మండల కేంద్రంలోని ఆడోనైడ్ కృపా చర్చిలో చర్చి పాస్టర్, సభ్యులు స్వచందంగా సమకూర్చిన నిధులతో 3 సిసి కెమెరాలు ఏర్పాటుచేశారు. నేర నియంత్రణతో పాటు భద్రతను కాంక్షించి చర్చిలోపలి భాగంలో, అదే విధంగా రోడ్డు పక్కన సిసి కెమెరాలను ఏర్పాటుచేశారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి సి.ఐ గంగాధర్ ముఖ్య అతిధిగా హాజరై సిసి కెమెరాలను ప్రారంభించి పాస్టర్, చర్చి సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ చంద్రశేఖర్, కానిస్టేబుల్ శ్యాంసన్, చర్చి పాస్టర్లు డేవిడ్, యోబు, ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

## నేడు శ్రీరామ కాలనీలో బోనాల ఉత్సవాలు



జల్ పల్లి, మేజర్ న్యూస్ (జులై 12):జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీలో నేడు బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆషాడ మాసం బోనాల సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల రోజే, శ్రీరామ కాలనీలో ప్రతి సంవత్సరం బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ కాలనీలో గల పోచమ్మ, దుర్గమ్మ, ముత్యాలమ్మ ఆలయాలను రంగురంగులతో అందంగా అలంకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయంలో ఉన్న అమ్మవారిని అలంకరించి, ఆదివారం బోనాల పండుగను నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం అమ్మవారి ఘటాలు, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయి.



# బాబోయ్ కుక్కలు...

- ఇప్పటికే కుక్క కాటుకు ఇద్దరు మృతి
- పలు గ్రామాలల్లో దాడులు చేస్తున్న కుక్కలు

**పెద్దేముల్,మేజర్ న్యూస్ (జులై 12):** కుక్కల దాడులకు ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పెద్దేముల్ మండలంలోని జనగాం, ఇందూరు గ్రామాలల్లో కుక్క కాటుకు ఇద్దరు మృతి చెందిన విషయం అందరికి తెలసిందే. కాగ నాలుగు రోజుల క్రితం పెద్దేముల్ మండల నాగులపల్లి గ్రామానికి చెందిన కుర్వ కిష్టప్ప (58), ఆత్కూర్ గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారి అకీల్‌లకు గ్రామ కుక్కలు దాడి చేశాయి.

ఈ సంఘటనలో కుర్వ కిష్టప్పకు తీవ్ర గాయాలు కావడంతో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైధ్య చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌కు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉందని గ్రామ ప్రజలు తెలియచేశారు.మండలంలో కుక్కల దాడులు అక్క డక్కడ జరుగడంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు.

ముఖ్యంగా పెద్దేముల్ మండల కేంద్రంలో మటన్, చికన్ దుకాణాల యజమానులు వెస్టేజ్‌ను


పెద్దేముల్ మండల కేంద్రంలో రోడ్ల పై తిరుగుతున్న కుక్కలు

ఎక్కడ పడితే వేయడంతో కుక్కల రోడ్లపై సంచరించడంతో దాడులు పెరుగుతున్నాయని, రోడ్ల పై వెళ్లె ప్రజలకు కూడ దాడులు చేస్తున్నయని ప్రయాణికులు అంటున్నారు. ఇప్పటి కైన గ్రామ పంచాయతి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు విధి కుక్కలు ప్రజలపై దాడులు చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మైనారిటీల పట్ల ప్రభుత్వం చిన్నచూపు

### టీఎస్‌యంహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ మొహ్మద్ వసీమ్

**కొడంగల్, మేజర్ న్యూస్ (జూలై 12):** మైనారిటీల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రసిడెంట్ మొహ్మద్ వసీమ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి (జూలై 11)ను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. గత ప్రభుత్వ హాయంలో కేసీఆర్ మహనీయుడి సేవలకు గుర్తింపుగా జూలై 11ను తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవంగా ప్రకటించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇంజనీర్ల దినోత్సవ వేడుకలను విస్మరించడం పట్ల తీవ్ర నిరాశ వ్యక్తం అవుతుందన్నారు. నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ నిజాం పాలనలో చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న సమయంలో నిర్మించిన ప్రాజెక్టులు, భవనాలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి ప్రాణవాయువులుగా నిలిచిన నీటి పారుదల నిర్మాణాలు నిజాంసాగర్, పోచారం, వైరా, పాలేరు, ఎగువ మానేరు, డిండి, హిమయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్, నాగార్జున సాగర్ తదితర కట్టడాలు ఆయన సేవలకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. అలాంటి మహా ప్రజా సేవకుడిని మర్చిపోవడం, జయంతిని నిర్వహించకపోవడంతో ముస్లిం మైనారిటీలకు బాధ కలిగిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ముస్లిం మైనారిటీల ఓట్లు దండుకొని మైనారిటీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. మైనారిటీలకు అసెంబ్లీ, ఎమ్మెల్సీ స్థానాలతో పాటు మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడం, ఇప్పటికే ఉన్న కార్పోరేషన్‌లకు అధికారాలు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 14 శాతంగా ఉన్న మైనారిటీలకు రాజకీయ ప్రాతినిథ్యం కల్పించకపోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా మైనారిటీ వర్గాలు ముస్లింలు, క్రిస్టియన్‌లు, సిక్కులు, బౌద్ధులు


మొహ్మద్ వసీమ్, టీఎస్‌యంహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్

ఇతరులు తమ హక్కుల సాధన కోసం ఒకే తాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో హక్కులు సాధించుకోవాలంటే పోరాటం తప్పదన్నారు. రాజకీయ పార్టీలపై ఆధారపడకుండా సంఘటితంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం...

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామి ఇచ్చి మోసం
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్

**వికారాబాద్, మేజర్‌న్యూస్ (జులై 12):** బీసీల రిజర్వేషన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడుతుందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మండిపడ్డారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభ ద్వరా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు 18 నుంచి 20 నెలలు గడుస్తున్నా, ఆ హామీ అమలవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకసారి బిల్లు ద్వారా రిజర్వేషన్ ఇస్తామని, మరొకసారి పార్టీ పరంగానే అమలు చేస్తామని చెప్పడం ప్రజలను భ్రమలోకి నెట్టే పని అని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో బిల్లు పాస్ అయినప్పటికీ, అది చట్టబద్ధత పొందాలంటే గవర్నర్,




రాష్ట్రపతి ఆమోదం అవసరమని అన్నారు. రాజ్యాంగ ప్రకారం అన్ని రిజర్వేషన్లు కలిపి 50 శాతం మించకూడదనే నిబంధన ఉన్న నేపథ్యంలో, తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు కొనసాగుతుందన్నారు. తమిళనాడులో 9వ షెడ్యూల్‌లో చేర్పు ద్వారా మాత్రమే ఇది సాధ్యపడిందని కేవలం బిల్లు ప్రవేశపెట్టడం కాదు, చట్టబద్ధత కోసం కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని స్పష్టం చేశారు. మహారాష్ట్ర, బీహార్, కేరళ లాంటి రాష్ట్రాల్లో ఆర్డినెన్స్‌లు ఫలించకపోయిన సందర్భాలను తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి వెళ్లి ప్రధాని మోదీతో అన్ని పార్టీల నేతలూ కలవాల్సిన అవసరం ఉందన్నారు. సంవత్సరానికి రూ. 20వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని కానీ ఆ మాటలకు ప్రాతిపదికే లేదని బీసీ సబ్‌ప్లాన్ లేదన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అంశాలు గాలిలో కలిసిపోయాయని విమర్శించారు. మంత్రివర్గంలో మైనారిటీలకు అవకాశం లేదని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో బీసీ మాజీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, పట్టణ అధ్యక్షుడు గోపాల్, మండల మైనార్టీసెల్ అధ్యక్షులు గయాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇటీవల మృతిచెందిన రాములుగౌడ్ కుటుంబం సభ్యులను పరామర్శించిన ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



**యాలాల్ మేజర్ న్యూస్:(జూలై 12)** మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన రాములుగౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి. రాములుగౌడ్ కుమారుడైనా నాగారం పాండుగౌడ్ కుటుంబాన్ని పరామర్శించి అధైర్య పడవద్దని అండగా ఉంటానని భరోసా ఇచ్చాడు. పరామర్శించిన వారిలో యాలాల మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్,కరణం పురుషోత్తంరావు,మాజీ కౌన్సిలర్ జి. పరిమళ,రాపోల్ రాములు,కమ్మరి శేఖర్,కిషన్ రావు,గౌస్, బషీర్, అన్నారం రాజు,గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

### మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్ ఆంజనేయులు ముదిరాజ్


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

**కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (జూలై 12):** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రాంరెడ్డి పల్లిలో అంబాబయ్ కి రూ.40 కుమ్మరి స్వాతి కు రూ. 58వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజల ఆరోగ్యానికి బాసటగా సీఎం రిలీఫ్ ఫండ్ ఎంత దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ, అడ్వకేట్ కోస్గి నర్సింలు యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అనమోని నర్సింలు, పార్టీ నాయకులు ఈడికి లక్ష్మయ్య, శ్రీనివాస రెడ్డి, బుగ్గయ్య, ఎల్లయ్య, కుమ్మరి కృష్ణయ్య, కుమ్మరి రమేష్, ఆంజనేయులు, వడ్డే మహేష్, యాదయ్య, మహేష్, ముజాహిద్ పూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు షర్పోద్దిన్, కాకి ఆనందం, కాకి శివ తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులోని పలు కుటుంబాలను పరామర్శించిన చీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి...

### పలువురు నేతలతో కలిసి వెళ్లిన పట్నం



**తాండూరు, మేజర్ న్యూస్ (జూలై 12):** తాండూరు ప్రాంతంలోని పలువురు కుటుంబాలను శనివారం నాడు ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల నే వివిధ కారణాలతోని మృతి చెందిన వారి వారి కుటుంబ సభ్యులను కలసి వారికి ధైర్యం చెప్పి పరామర్శించారు. పలువురు నేతలతో కలిసి వారి వారిని కలిశారు. తాండూరు టౌన్ లోని ఇందిరా నగర్ కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ అస్లాం కుటుంబాన్ని, తాండూరు మండలం దస్తగిరి పేట్ కు చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ స్వర్గీయ బాగువన్ కరీం కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే మండల కేంద్రమైన యాలాల కు చెందిన మాజీ ఎంపీటీసీ స్వర్గీయ రాములు గౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు అలాగే టౌన్‌లో రెండు రోజుల క్రితం ప్రారంభించిన వంశీ న్యూరో అస్పత్రి ని సందర్శించారు.ఈ కార్యక్రమాలలో రాష్ట్ర టీపీసీసీ ప్రచారసమన్వయ కర్త కరణం పురుషోత్తం రావు, సీనియర్ నేతలు డాక్టర్ సంపత్ కుమార్, సిద్రాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శ్రీమతి గడ్డలి పరిమిళ, బీదర్ రాజ్ శేఖర్, రఘు, అబ్దుల్ ఖావి, భగవాన్, తదితరులు ఉన్నారు.

## టియుఎఫ్ఐడిసికి పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వినతివివిధ కాలనీలు పర్యటించిన చల్లా



బాలాపూర్ మేజర్ న్యూస్(జులై 12): వివిధ కాలనీల అధ్యక్షులు తమ కాలనీలోనీ పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని టి యు ఎఫ్ ఐ డి సి చైర్మన్ చల్లా కు వినతి. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని కాలనీల అభివృద్ధి కార్యక్రమాల పై రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి శనివారం పలువురు కాలనీ వాసులతో కలిసి ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని వివిధ కాలనీల అధ్యక్షులు తమ కాలనీలలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలపై తెలంగాణ రాష్ట్ర టి యు ఎఫ్ ఐ డి సి కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి కి వినతి పత్రాన్ని అందజేశారు. వారికి ఇచ్చిన హామీ మేరకు పలు కాలనీల ప్రెసిడెంట్లను కలుపుకొని విజ్ఞానపురి కాలనీ, న్యూ నంది హిల్స్, ప్రశాంతి హిల్స్, డిఎల్ఆర్ఎల్ కాలనీలో పర్యటించి పరిశీలించారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా డి ఎల్ ఆర్ ఎల్ కాలనిలో మొక్కలు నాటారు. అలాగే ఎక్కడెక్కడ సిసి రోడ్లు అవసరం, ఉన్నాయనీ అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఎక్కడెక్కడ అవసరం ఉంది అని అక్కడ తర్వగతిగా పనులు పూర్తి చేయాలని వివిధ అధికారులకు ఆదేశాలు సూచించారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, 10వ వార్డు మాజీ కార్పొరేటర్ ముద్ద పవన్, 8వ వార్డ్ మాజీ కార్పొరేటర్ హరినాథ్ రెడ్డి, చల్లా ప్రభాకర్ రెడ్డి,సుభాష్ రెడ్డి,మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లిస్తాం

### – జిల్లా విజయడైరీ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళి




కేశంపేట, మేజర్న్యూస్ (జులై 12): విజయ డైరీ నుంచి రైతులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ఎండితో మాట్లాడి వెంటనే చెల్లించేలా చూస్తామని రంగారెడ్డి జిల్లా విజయడైరీ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళి అన్నారు. కేశంపేట మండల కేంద్రంలోని బీఎంసీయులో శనివారం పాల కేంద్రాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రైతుల నుంచి పాల కేంద్రాల్లో నాణ్యమైన పాలను సేకరించి సంస్థ అభివృద్ధికి దోహదపడాలని, నాణ్యమైన పాలతో సంస్థలకు మంచి లాభాలు, పేరు వస్తుందని తెలిపారు. ఎండిఈ కార్యక్రమంలో కేశంపేట బీఎంసీయు అధ్యక్షుడు పిల్లి అమరేష్యాదవ్, పాల కేంద్రాల అధ్యక్షులు నిదురం అంజనేయులు, రమేష్, జనార్దన్రెడ్డి, పులిమామిడి అంజనేయులు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయం



గండిపేట్, మేజర్ న్యూస్ (జులై 12)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మకమైన నిర్ణయం అని వట్టినాగులపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివపాల్ సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం 42% రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మకమైన నిర్ణయం అని అన్నారు. వెంటనే బీసీ రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం చెసి ఆర్డినెన్స్ తీసుకురావాలని కోరారు.పంచాయతీరాజ్ చట్టం–?2018కి సవరణలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు. అనంతరం వట్టినాగులపల్లి గ్రామ పంచాయతీ వార్డు కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శిపాల్ సింగ్ కుమ్మరి శేఖర్, బుడాల అరుణ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తారా సింగ్, పరమల మల్లేష్ యాదవ్, మంగళారం కృష్ణ యాదవ్, బుడాల దర్శన్ ముదిరాజ్, మేకల లక్ష్మణ్ రెడ్డి, గడిల లక్మన్, గోరెంకాల నరసింహ ముదిరాజ్, మంగలి యాదగిరి, మొద్దు సాయిరాం ముదిరాజ్,కొండె సాయికిరణ్ యాదవ్, మంగళారం శ్రీకాంత్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిగురింత పెద్ద బాల్ రెడ్డి దశదినకర్మలో పాల్గొన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



బాలాపూర్ మేజర్ న్యూస్(జులై 12):మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్కు చెందిన చిగురింత పెద్ద బాల్ రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరై పూల మాల వేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సి ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన దశదీనాకర్మనీకి ఎందరో నేతలు, నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిగురింత కుటుంబ సభ్యులు, నాయకులు, కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొనీ నివాళులు అర్పించారు.

## ఘనంగా మాజీ కౌన్సిలర్ శ్రీధర్ గౌడ్ జన్మదిన వేడుకలు



జల్పల్లి, మేజర్న్యూస్ ( జూలై 12): జల్పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీ 17 వార్డు మాజీ కౌన్సిలర్ ప్రశాంతి శ్రీధర్ గౌడ్ జన్మదిన వేడుకలు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. శనివారం ఆయన జన్మదినం పురస్కరించుకుని రాజకీయ నాయకులు,కాలనీ ప్రజలు కేక్ కట్ చేసి, పుష్పగుచ్ఛంతో అందించి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్ఎం ఎన్ క్లేవ్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు వినతి



గండిపేట్, మేజర్ న్యూస్ (జూలై 12)బండ్లగూడ జాగిర్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ ప్రాంతానికి చెందిన ఎస్ ఎం ఎన్ క్లేవ్ లో తాగునీటి సమస్య ను పరిష్కరించడం తో పాటు మౌలిక వసతులు కల్పించాలని శనివారం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ కు స్థానిక మాజీ కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్ గౌడ్ భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో మంచినీటి సమస్య ను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవి, సమత, శశి, ప్రవీణ్ రంజిత్, గోవర్ధన్ సింగ్, కృష్ణారెడ్డి, వెంకట్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం




కేశంపేట, మేజర్న్యూస్ (జులై 12): కేశంపేట మండల కేంద్రంలో శనివారం అనారోగ్యంతో మృతి చెందిన జూలపల్లి పెద్ద అంజయ్య కుటుంబానికి మాజీ జడ్పిటిసి తాంద్ర విశాలశ్రావణ్రెడ్డి రూ.5 వేలు, కేశంపేటకు చెందిన సీనియర్ జర్నలిస్టు గుండ్రాతి రమణగౌడ్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేసి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్రాతి రమణగౌడ్, బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు జూలపల్లి అనసూయమ్మ, రొయ్యల అంజయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కుక్కల యాదయ్య, కడియాల యాదయ్య, గ్రామస్థులు గంజాయి ధశరథం, మంచె వెంకటయ్య, లిక్కి శ్రీను, జాజాల రాము పాల్గొన్నారు.

### చెంచు కాలనీవాసుల నిమిత్తం

## బహుళార్థక సాధక కేంద్ర భవన నిర్మాణం...

**మొదటిపేజీ తరువాయి...** శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి చెంచు కాలనీలో ప్రధానమంత్రి జన్మాన్ పథకం కింద నిర్మించే బహుళార్థక సాధక కేంద్రం (మల్టీ పర్పస్ సెంటర్) భవన నిర్మాణానికి రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ... చెంచు కాలనీ వాసుల వివిధ అవసరాల నిమిత్తం 60 లక్షల వ్యయంతో బహుళార్థక సాధక కేంద్రం భవనాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. భవన నిర్మాణంతో చెంచు కాలనీ వాసులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి, ఆర్డీవో వాసు చంద్ర, తహసిల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలలో పాల్గొనండి

### అమరేందర్ రెడ్డికి చత్రపతి శివాజీ యూత్ సభ్యుల ఆహ్వానం





జల్ పల్లి, మేజర్ న్యూస్ (జూలై 12):మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ గ్రామంలో ఈనెల 18న నిర్వహించే బోనాల ఉత్సవాలలో పాల్గొనాలని కంటెస్టెడ్ ఎమ్మెల్యే, టిపిసిసి కార్యదర్శి యేలిమేటి అమరేందర్ రెడ్డిని శివాజీ యూత్ సభ్యులు ఆహ్వానం అందజేశారు. ఈ మేరకు అమరేందర్ రెడ్డిని శనివారం వారి నివాసంలో చత్రపతి శివాజీ యూత్ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఆహ్వానం అందజేసిన వారిలో సత్య ప్రకాష్, మిట్టు, టి దినేష్, జయవర్ధన్, ఉదయ్ కుమార్, అరుణ్ కుమార్, సిహెచ్ పవన్ కుమార్, బి మహేష్, పి సాయి, కే వరుణ్, జి సాయికుమార్, ఎం దినేష్, వంశీ, జాషు, జొన్నాడ పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు భరత్ కుమార్, సుదర్శన్, శివ, మహేష్, మధు, భాను, శ్రీకాంత్, పవన్, దినేష్ తదితరులు ఉన్నారు.

# కళలు కాపాడటం మన బాధ్యత : మామిడి హరికృష్ణ

## నాదనలోగా డాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో భవ్యంగా... సిరి నిహిత అరంగేట్రం



సిరి నిహిత నాట్య ప్రదర్శన..





సినీ దర్శకుడు ఓంకార్ కీ జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

**కీసర,మేజర్ న్యూస్ (జూలై 12):** "భారతీయ సాంప్రదాయ కళలు మన మూలాలను తెలియజేసే అద్దం. ఇవి రాబోయే తరాలకూ అందాలంటే మనం కళను ప్రేమించాలి, కాపాడాలి" అని భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. దమ్మాయిగూడ కేంద్రంగా నాట్య విద్యను అందిస్తున్న నాదనలోగా భరతనాట్యం డాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో నాగారంలో శుక్రవారం రోజు నిర్వహించిన సిరి నిహిత అరంగేట్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దమ్మాయిగూడకు చెందిన యువ నర్తకి సిరి నిహిత, గురువు లక్ష్మీప్రియ శిక్షణలో భరత నాట్యంలో నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. ఐదు వందల మందికిపైగా కళాభిమానులు ఈ నాట్య ప్రదర్శనను తిలకించి హర్షాతిరేకం వ్యక్తం చేశారు.

**నాట్యమే కాదు – నిష్ఠతో నిండి ఉన్న ప్రదర్శన**

ఈ సందర్భంగా, హరికృష్ణ మాట్లాడుతూ – "ఇలాంటి అరంగేట్రాలు కళను పరిరక్షించే గొప్ప అవకాశాలు. ఇవి ఒక కుటుంబం, గురువు, విద్యార్థి మధ్య ఉన్న నిబద్ధతను, భావోద్వేగాన్ని అందరికి తెలియజేస్తాయి. సిరి నిహిత నాట్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఆమెలో ఉన్న నిశ్చల శ్రద్ధను గుర్తించారు" అని అన్నారు.

**ప్రముఖులు సందడి – అభినందనల వెల్లువ**

ఈ కార్యక్రమానికి భారతీయ టెలివిజన్ వ్యాఖ్యాత సినీ దర్శకుడు ఓంకార్, సాయి సారస్ నాట్యాలయ డైరెక్టర్ రమ్య ప్రదీప్, ఆహా ఓటీటీ వాణిజ్య విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈసందర్భంగా, ఓంకార్ మాట్లాడుతూ – "ఒక గురువు శ్రద్ధతో, విద్యార్థి శ్రమతో కలిసినప్పుడు కళ అందమైన రూపాన్ని దాల్చుతుంది. లక్ష్మీప్రియ శిక్షణలో సిరి నిహిత ఆత్మవిశ్వాసంతో వేదికను ఆక్రమించిన తీరు ఆదర్శప్రాయం" అన్నారు.

**లైవ్ సంగీతం – నాట్యానికి ప్రాణం**

ప్రదర్శన సమయంలో వేదికపై ప్రత్యక్షంగా వాయిద్యకారుల సమన్వయం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. వాయలిన్, మృదంగం, నాట్య సంగీతం నాట్య శైలికి కొత్త ఊపునిచ్చింది. ప్రతి కూర్పు ముగిసే సరికి హాల్ అంతా కరతాళధ్వనులతో మార్మోగింది. అంతిమంగా, నిర్వహణ బృందం, వాలంటీర్లు, సాంకేతిక సిబ్బంది సహకారంతో పాటు తల్లిదండ్రులు రామకుమార్, పుష్ప ప్రతీమకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**నాదనలోగా – నాట్యకళకు ఆధునిక పునాది**

దమ్మాయిగూడలోని నాదనలోగా డాన్స్ స్కూల్ భారతీయ నాట్యకళను నూతన తరం ముందుకు తీసుకెళ్లే దిశగా ముందడుగు వేస్తోంది. లక్ష్మీప్రియ శిక్షణలో తయారవుతున్న ప్రతిభావంతుల ప్రదర్శనలు క్లాసికల్ డాన్స్ పట్ల యువతలో ఆసక్తిని పెంచుతున్నాయి.



మామిడి హరికృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న.. డాన్స్ స్కూల్ యాజమాన్యం

# పార్టీ అభ్యున్నతికి కృషి చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు

- డిసిసి ఉపాధ్యక్షుడు బోలుసాని భీంరెడ్డి
- మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్ ఆంజనేయులు ముదిరాజ్



గ్రామ కమిటీ అధ్యక్షులకు నియామక పత్రాలు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (జూలై 12)** పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేసే ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని డిసిసి ఉపాధ్యక్షుడు బోలుసాని భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బి.ఎస్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని చిన్న అంతారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా కావలి తిరుపతయ్య, పెద్ద అంతారం గ్రామ అధ్యక్షుడిగా పాల విష్ణువర్ధన్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు తీసుకువెళ్తూ పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, మాజీ ఎంపిటిసి ఆనందం, స్థానిక నాయకులు శివానంద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ముదిరాజ్ సంఘం తరుపున ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం.

**దోమ, మేజర్ న్యూస్ (జులై 12):** బొంపల్లి గ్రామానికి చెందిన రాగుల శివమ్మ చనిపోయిన సందర్భంగా వారి అంత్యక్రియలకు ముదిరాజ్ సంఘం తరుపున ఆర్థిక సహాయము చేశారు. ఈ కార్యక్రమములో బొంపల్లి ముదిరాజ్ సంఘం పెద్దలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం

# రిజర్వేషన్ పెంపు పట్ల హర్షం

### కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పి. వెంకటయ్య గౌడ్



**కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (జూలై 12)** స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంపు హర్షనీయమని ఇది చారిత్రాత్మక నిర్ణయం అని కుల్కచర్ల మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పి. వెంకయ్య గౌడ్ పేర్కొన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో ఏళ్ల కల ఫలిస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు వెనుకబడిన వర్గాల సుదీర్ఘ కలను నిజం చేస్తున్నందుకు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాలను పక్కనబెట్టి రిజర్వేషన్లు చట్ట రూపం అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన సాహసోపేత నిర్ణయం అని అన్నారు.ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ఈ చట్టంలో సవరణలు తీసుకురావాలని ప్రభుత్వం వేసుకున్న నిర్ణయం నిర్ణయిం అందరిలో ఆనందాన్ని కలగ చేస్తుందని చెప్పారు. ఇన్నేళ్లకు బీసీ వర్గాల కలలు ఫలిస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

# పేద కుటుంబాలకు బిజెపి అండగా నిలుస్తుంది

## బిజెపి పార్టీ గ్రామ అధ్యక్షుడు ముద్దం మల్లేష్ యాదవ్

**దోమ, మేజరన్యూస్ (జులై 12):** పేద కుటుంబాలకు బిజెపి అండగా నిలుస్తుందని బిజెపి గ్రామ అధ్యక్షుడు ముద్ద మల్లేష్ యాదవ్ అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన రాగుల శివమ్మ(53) అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు విషయం తెలుసుకున్న బిజెపి నేతలు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఒక్కో కార్యకర్త తన వంతు సహాయంగా ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. బాధిత కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.నాలుగు వేల ఆర్థిక సహాయంగా అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదల పక్షాన బిజెపి అనునిత్యం అండగా ఉంటూ భరోసా కల్పిస్తుంది అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చారని గుర్తు చేశారు. ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకం అందుతుందని చెప్పారు. గ్రామ గ్రామాన బిజెపి



కార్యకర్తలు పేద ప్రజలకు అండగా ఉంటూ భరోసా కల్పించేందుకు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు బోయిని నరేష్, ముద్దం నరసింహ యాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్,నరసింహులు యాదవ్,బోయిని బాలరాజ్ ముదిరాజ్, కుమ్మరి చిన్నయ్య, వెంకటేష్, పవన్, సాలే శివ, గుడిసె బాబు ముదిరాజ్, వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మెను ప్రకారం భోజనంలా లేదు...

# పురుగుల అన్నమే పరమాన్నం...

- కెజిబివి విద్యార్థుల ఆందోళన...
- విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

మర్పల్లి, మేజర్‌న్యూస్(జులై12):

మర్పల్లి మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో మెనుప్రకారం భోజనం లేదు పురుగుల అన్నమే పరమాన్నంగాభోజనాలు పెడుతున్నార ని కస్తూర్బా పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగగా విద్యార్థుల తల్లి దండ్రులు నిరసన వ్యక్తం చేశారు. మర్పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులు భోజనం బాగాలేదని శనివారం ఆందోళ నకు దిగారు.మెను ప్రకారం భోజనం అందివ్వడం లేదనీ అప్పుడప్పుడు పురుగు అన్నం వండి పెడుతున్నారనీ ఈ విషయమై యస్.ఓ మేడంకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదనీ విద్యార్థులు ఆందోళనకు దిగగా శనివారం కావడ ంతో విద్యార్థు ల తల్లి తండ్రులు సైతం అక్కడికి వచ్చి నిరసన తెలిపారు.ఇట్టి విషయంపై యస్.ఓను వివరణ కోరగా విద్యార్థులు భోజనం మేమే వడ్డిస్తాము. చపాతీలు మేమే చేస్తామనీ తెలుపడంతో మీరు చదువు కోవడానికి వచ్చారా .? లేక పనులు చేయడానికి వచ్చారా అని విద్యార్థులను బెదిరిం చడంతో వారు కొందరు ఉపాధ్యాయులు లేని పోని రాద్ధాంతం చెస్తూ తనను అపకీర్తి పాలు చేస్తూన్నారే





తప్పా ఇందులో నా దోషమేమి లేదనీ కస్తూర్బా విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ సునిత పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం

### నల్సార్ స్నాతకోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి టిపిసిసి నేతల ఆదరాభిమానాలు




**షామిర్ పేట,మేజర్ న్యూస్ (జూలై 12):**నల్సార్ యూనివ ర్సిటీలో శనివారం నిర్వహిం చిన స్నాతకోత్సవానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టిపిసిసి నేతలు సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. సీఎంను ప్రత్యేకంగా కలిసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రష్ యాదవ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి అభినందలు తెలిపారు.

# ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

### సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపులోకి వస్తాయి : కొత్తూరు సీఐ నర్సింగ్ రావు

కొత్తూరు, మేజర్ న్యూస్ (జూలై 12) : సీసీ కెమెరాలతో నేరాలు అదుపులోకి వస్తాయని కొత్తూరు సీఐ నర్సింగ్ రావు అన్నారు. మండల పరిధిలోని కోడిచర్ల గ్రామంలో 14 సీసీ కెమెరాలను శనివారం నాడు సీఐ నర్సింగ్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఎస్సై గోపాల క్రిష్ణ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే నేరాలు తగ్గుతాయని అన్నారు. నేరాల అదుపునకు సీసీ కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఆయన అన్నారు.



సిసి కెమెరాలు ప్రారంభిస్తున్న సి.ఐ నర్సింహ్మారావు

# తొట్టెల ఊరేగింపుకు మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డికి ఆహ్వానం



**గండిపేట్, మేజర్ న్యూస్ (జులై 12)**

బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనిహైదర్షాకోట్ గ్రామంలో ఈనెల 20వ తేదీ బోనాల పండుగ సందర్భంగా శ్రీ కృష్ణ యూత్ అసోసియేషన్ వారు నిర్వహించే తొట్టెల ఊరేగింపు కార్యక్రమానికి బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి ని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాశం కుమార్ యాదవ్, శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనురాగ్ యూనివర్సిటీ ఆవరణలో నిర్మాణంలో ఉన్న స్లాబ్ కూలీ నలుగురికి గాయాలు

**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (జులై 12) :**

అనురాగ్ యూనివర్సిటీ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవనం పదవ అంతస్తు స్లాబ్ కూలి కింది అంతస్తులో పడడంతో నలుగురికి గాయాలైన సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోచారం ఐటి కారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలోని అనురాగ్ యూనివర్సిటీలో నిర్మిస్తున్న భవనం 10వ అంతస్తు స్లాబ్ వేస్తుండగా సపోటుగా ఉన్న సెంట్రింగ్ జాక్ జరిగిపోవడంతో, అక్కడ పనిచేస్తు న్న నలుగురు కార్మికులు మహబూబ్ నగర్ కు చెందిన రాజు (20), కేశవ్(30), చత్తీస్గడ్‌కు చెంది న రాజు యాదవ్( 34), ఓం ప్రకాష్(28)లు 9వ అంతస్తులో పడడంతో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయాలైన వ్యక్తులను సమీపంలోని నీలిమ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు భవన నిర్మాణ కాంట్రాక్టర్ తెలిపారు.



ఈ మేరకు ఐటి కారిడార్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని ప్రమాధ తీరును పరిశీలించి. ఆస్పత్రిలో చిక్సి పొందుతున్న బాధితుల నుండి పలు వివరాలు సేకరించి భవన నిర్మాణ కాంట్రాక్టర్ పిర్యాదు మేరకు కేసు నామోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# బోర్‌వెల్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**కందుకూరు, మేజర్‌న్యూస్ (జూలై 12):** బోర్‌వెల్ వాహనం టీవీఎస్‌ను ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె.సీతారాం తెలిపిన వివరాల ప్రకారం కందుకూరు మండలం బండమీది గూడూరు గ్రామానికి చెందిన గోల్కొండ జంగయ్య (57) శనివారం ఉదయం అందాజ 8:15 నిమిషాలకు జైత్వారం నుండి గూడూరు గ్రామానికి టీవీఎస్ లూన



వాహనంపై తన మరదలు లక్ష్మమ్మను ఎక్కించుకుని బయలు దేరుతుండగా మార్గ మధ్యలో కొత్తగూడ సమీపలోని మద్దుల లక్ష్మారెడ్డి ఫౌల్ట్రీ వద్ద బోర్‌వెల్ వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా నడిపి లూనాను ఢీకొనడంతో జంగయ్య తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో అక్కడిక్కడే చనిపోయాడని తెలిపారు. లక్ష్మమ్మకు గాయాలు కావడంతో 108లో ఆసుపత్రికి తరలించారు.కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.